# అఖండుడు

(గల్పిక)

ఆ మనిషికి నూరులోపల ఎంత వయసైనా ఉండొచ్చు. మాట్లాడటం మాత్రం ధాటిగా ఉంది. మాటలు దిగ్భ్రమ కలిగించేలాగున్నాయి.

"... నెహ్రూతో చెప్పేశాను. 'అబ్బాయీ, ఊగిసలాడక దేశవిభజనను ఒప్పేసుకో. ముందుపని జరగాలి,' అన్నాను ... ప్రకాశంగారితో ఎంత పోరితే చీఫ్‌మినిస్టరు కావటానికి ఒప్పుకున్నాడు.

అలా మాట్లాడుతూ పోతున్నాడు. చార్లీ చాప్లిన్ అమెరికానుంచి వచ్చెయ్యమని తానే చెప్పాట్ట! "అబ్బా, యుద్ధం బాగా చేయించావు. నీ పని అయిపోయింది మరి దిగిపో!" అని చర్చిల్‌కు చెప్పాట్ట! "దక్షిణ కొరియాలోకి మరీ దూరం వెళ్ళకు, దారితప్పి పోగలవు," అని ట్రూమన్‌కు చెప్పాట్ట.

సమయానికి శ్రీశ్రీ లేనందుకు విచారించాను. అట్టడుగున దాగిన చరిత్ర రహస్యం కావాలంటాడు గద శ్రీశ్రీ. ఇదుగో ఆ రహస్యం!

"అయ్యా, తమరి ప్పుడు మా ఆఫీసుకు ఎందుకు దయచేసినట్టు?" అని ఎవరో అడిగారు.

"మరేం లేదు. మీ బాస్‌ను చూసి పోదామని అతను కుక్కిమంచంలో పడుకుని గోళ్ళు గిల్లుకుంటూంటే, 'లేవయ్యా, లే! బిజినెస్ చెయ్యి,' అని యిందులోకి దించాను. చూస్తున్నారుగా? ఒక కోటికి పడగెత్తాడు. ఓ వెయ్యి మందికి భృతి కలిగిస్తున్నాడు. ఉన్నాడా అని అడిగితే బయటికి వెళ్ళాడన్నారు. వెయిట్ చేస్తున్నా."

"లాభం లేదండీ. ఆయన ఇవాళ మరి రారు?" అనేశా. నా పక్కన టెలిఫోన్ మోగింది.

"ఆ పూలింకా ఉన్నాడా, వెళ్లాడా?... ఓ పదిరూపాయలిచ్చి పంపండి. డబ్బు కోసం వచ్చి ఉంటాడు.

బాస్ గొంతు.

కొడవటిగంటి కుటుంబరావు